
**అప్పుల మీద బతుకుబండిని లాగించే ఓ మధ్యతరగతి కుటుంబీకుడి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే దాని పరిణామం ఎలా ఉంటుంది? అతనికి కలిగే మానసిక సంఘర్షణ ఏ స్థాయిలో ఉంటుంది? దిక్కుతోచని పరిస్థితులలో అల్లాడే అతనికి ఓ ఆదరువు దొరికితే, ఓ అండ లభిస్తే అతని బాహ్యప్రవర్తనలో అది ఎలా ప్రతిఫలిస్తుందో సరిగ్గా తెలియజెప్పిన కథ ఇది.**

# మంట





వీరభద్రరావ్ పమ్మి

"ఏవండీ- ఎందుకలా డల్‌గా ఉన్నారు"

ఆ ప్రశ్న అయిదోసారి అడిగింది గాయత్రి.

"ఏంలేదని చెప్పానుగా" రాజు కంఠంలో కొంచెం విసుగు ధ్వనించింది.

సాయంత్రం రాజు ఇంటికొచ్చినప్పట్నుంచి అలాగే డల్‌గా, సర్వం కోల్పోయినవాడిలా ఉన్నాడు.

తమ పెళ్ళయిన మూడేళ్ళలోను భర్త ఎప్పుడూ అలా లేడు. అందుకే గాయత్రికి చాలా భయంగాను, ఆందోళనగాను ఉంది.

ఆమె కాఫీ కలిపి ఇస్తే యాంత్రికంగా తాగాడు.

యాంత్రికంగా బట్టలు మార్చుకున్నాడు.

"స్నానం చేస్తారా" అనడిగితే సమాధానం చెప్పకుండా కాళ్ళు, చేతులూ కడుక్కుని వచ్చేసాడు.

భోజనానికి పిలిస్తే యాంత్రికంగా వచ్చి, యాంత్రికంగా నాలుగు మెతుకులు కతికి చెయ్యి కడుక్కుని వెళ్ళిపోయాడు.

రోజూ పదిన్నర దాకా టి.వి. చూసే మనిషి తొమ్మిది కాకుండానే పడగ్గదిలోకి వెళ్ళిపోయి, మంచంమీద వెల్లకిలా పడుకుని సీలింగ్‌కేసి చూస్తూ ఆలోచిస్తున్నాడు.

గాయత్రి మనసు పరిపరివిధాల పోయింది.

ఏదో పెద్ద అవాంతరం ముంచుకొస్తేగాని భర్త అంత డల్‌గా అయిపోడని ఆమెకి తెలుసు. ఏం చెయ్యాలో ఆమెకి తోచడంలేదు. టి.వి.కేసి చూస్తోందేగాని- ఆమె మనసు బుల్లితెరమీద జరుగుతున్న కథ మీదా, సంఘటనల మీదా లేదు.

** ** **

రాజు ఆలోచిస్తున్నాడు.

అతని మెదడు మధ్యాహ్నం జరిగిన సంఘటనని మళ్ళీమళ్ళీ కేసెట్‌లా తిప్పుతోంది.

ఆ భైరవమూర్తిగాడు ఎంత మాటన్నాడు?

రాజు పళ్ళు పటపట కొరికాడు. అంతే! అంతకుమించి అతను వాణ్నేంచేయలేదు.

నిజమే! తాను వాడికి పదివేల రూపాయలు ఇవ్వాల్సిన మాట నిజమే... వాడి దగ్గర తీసుకున్న అప్పుకుగాను నెలకి అయిదువందల రూపాయలు వడ్డీ కడుతున్నాడు. అదీ ఒక నెలా, రెండు నెలలూ కాదు-

మూడు సంవత్సరాలుగా- అంటే ముప్పై ఆరునెలలు- వెరసి పద్దెనిమిదివేల రూపాయలు వడ్డీగా కట్టాడు.

వడ్డీ కట్టడంలో ఎప్పుడూ ఒక్కరోజు కూడా ఆలస్యం చెయ్యలేదు. కాని- రెండు నెలల క్రితం "నాకు నెలరోజుల్లో అసలు ఇచ్చెయ్" అన్నాడు.

"వడ్డీ కచ్చితంగా కడుతున్నాగా?" అంటే.

"నాకు అసలు కావాలి" అన్నాడు.

"పైగా తప్పకుండా ఇచ్చెయ్యాలి" అన్నాడు.

ఇదే విషయం ఓ స్నేహితుడితో అంటే "ఇప్పుడు వడ్డీ రేట్లు పెరిగాయి. ప్రతిచోట పది రూపాయలు వసూలు చేస్తున్నారు. నిన్ను పది చొప్పున అడగలేదు. నీ దగ్గర అసలు తీసేసుకుని వేరొకళ్ళకి పదిరూపాయల వడ్డీకి ఇస్తాడు" అన్నాడు.

అతను చెప్పేదాకా రాజుకి సూక్ష్మం అర్థంకాలేదు.

కాని ఒక్కసారిగా పదివేలు ఎక్కణ్నుంచి తేగలడు?

భైరవమూర్తి మరీ సతాయిస్తుంటే ప్రావిడెంట్‌ఫండ్ లోన్‌కి అప్లై చేసాడు.

ఏవో అనుమానాలతో అది రెండుసార్లు హెడ్డాఫీసునుంచి తిరిగొచ్చింది.

భైరవమూర్తి పదిరోజులకు ఓసారి అసలు చెల్లించమని అడుగుతూనే ఉన్నాడు. రాజు ఏదో ఒక కారణం చెప్తూనే ఉన్నాడు.

ఆఖరికి ఆరోజు భైరవమూర్తి ఆఫీసుకొచ్చాడు. సెక్షన్లో మాట్లాడటం ఎందుకని రాజు అతన్ని బైట హోటల్‌కి తీసుకెళ్ళాడు. మళ్ళీ అసలు చెల్లించమని అడిగాడు. రాజు చెల్లించలేకపోడానికి కారణాలు చెప్పి కొంచెం సమయం కావాలని అడిగాడు.

"ఎన్ని కథలు చెప్తావురా. మీ అమ్మ చచ్చిపోయి శవాన్ని ఎత్తడానికి డబ్బుల్లేకపోతే రాత్రికి రాత్రి పదివేలిచ్చాను. అసలియ్యమంటే కథలు చెప్తున్నావు... ఏం- ఎలా వుంది? తల్చుకున్నానంటే బొమికలు విరిగిపోతాయి" అన్నాడు గొంతు పెంచి.

"అదేంటయ్యా- అలా మాట్లాడతావ్- నెలనెలా వడ్డీ కట్టడంలేదా?" అన్నాడు రాజు. అప్పటికే అతనికి గొంతు తడారిపోయింది.

"ఏం ధర్మానికి కడుతున్నావా? డబ్బు తీస్కున్నావ్- కడుతున్నావ్... ఇదిగో- ఇపుడే చెప్తున్నాను. నీకు వారం రోజులు గడువిస్తున్నా... అంటే ఏడురోజులు. ఆలోగా నా అసలు కట్టకపోయావా? నీ పెళ్ళాన్ని ఎత్తుకుపోతా!" అని విసురుగా వెళ్ళిపోయాడు.

రాజు మెదడులో అవే మాటలు. మళ్ళీ... మళ్ళీ... మళ్ళీ...

** ** **

మరో గంటపోయాక గాయత్రి పడగ్గదిలోకి వెళ్ళి లైటు వేసింది. రాజు అలాగే సీలింగ్‌కేసి చూస్తూ కళ్ళు తెరిచి పడుకున్నాడు.

గాయత్రి అతని పక్కనే పడుకుంది. పక్కకి తిరిగి మీద చెయ్యేసింది. అతనిలో చలనం లేదు.

ఆమె అటు తిరిగి నిద్రపోడానికి ప్రయత్నించింది. కళ్ళు మూతపడటంలేదు. చటుక్కున ఆమెకో ఆలోచన వచ్చింది.

రాజుకి అత్యంత ప్రీతిపాత్రమైన విషయంశృంగారం.

"ప్రపంచంలో ఏ సుఖమైనా దీనిముందు దిగదుడుపే. శారీరక మానసిక అలసటని పోగొట్టడమే కాకుండా, మనసుకి శాంతిని, ప్రశాంతిని ప్రసాదిస్తుంది. నేను జీవితంలో నీనుంచి ఇంకేమీ కోరను. ఈ సుఖం మాత్రం ప్రతిరోజు, అన్నివేళలా ప్రసాదించు"

భార్యతో అనేకసార్లు అన్నమాటలివి.

గాయత్రి లేచి బాత్రూంకి వెళ్ళింది. స్నానం చేసింది. వేరే చీర కట్టుకుంది. సెంటు పూసుకుంది. భర్త పక్కనే పడుకుని అతన్ని గట్టిగా కౌగలించుకుంది. అతనూ ఆమెవైపు తిరిగాడు. ఆమె మీద చెయ్యి వేసాడు. ఆమె గుండెల్లో తల జొనిపాడు.

ఆమెతో సహకరించడానికి శతవిధాల ప్రయత్నం చేసాడు. కాని అతని దృష్టిలో ఆ చీకటి గదిలో భైరవమూర్తి తిరుగుతున్నాడు. వాడి మొహం ఎర్రటి నిప్పుముద్దలా ఆ చీకట్లో అతనికి కనిపిస్తోంది.

గాయత్రి ఎంత ప్రయత్నించినా, అతను ఎంత సహకరిద్దామనుకున్నా- అతనిలో పురుషుడు మేల్కొనలేదు.

గాయత్రి భర్తని గట్టిగా ముద్దుపెట్టుకుని దూరంగా

జరిగి పడుకుంది. మరో గంటకి ఆమెకి నిద్రపట్టింది.

"నీ పెళ్ళాన్ని ఎత్తుకుపోతా!"

ఎంతమాటన్నాడు రాస్కెల్... రాజుకి అవే ఆలోచనలు. అవే... అవే... అవే...

ఏం చెయ్యాలి?

వాడికి బుద్ధిచెప్పే మార్గం లేదా?

అలా ఆలోచిస్తున్నాడు. నిద్ర పట్టడంలేదు.

మరి కాసేపటికి...

రాజుకి గౌరీపతి జ్ఞాపకం వచ్చాడు.

నాలుగు నెలల క్రితం తనని వెతుక్కుంటూ ఆఫీసుకొచ్చాడు.

"ఒరేయ్ రాజూ- నన్నీ ఊళ్ళో పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా వేసారు. మనం తరచూ కలుస్తూండవచ్చు. నీకేం సహాయం కావాల్సి నా- ఎప్పుడైనా సరే- అర్ధరాత్రి, అపరాత్రీ లేదు. ఒక్క ఫోన్ కాల్ కొట్టు. వచ్చి వాల్తాను.

ఒరేయ్... మన చిన్నప్పుడు మీ అమ్మగారు పులిహోర చేసినప్పుడల్లా మీ ఇంటికి తీసికెళ్ళి పెట్టేవాడివి గుర్తుందా... అబ్బ- ఎంత రుచిగా ఉండేదిరా. ఇప్పటికీ నోట్లో నీళ్ళూరుతుంటాయి" అన్నాడు గౌరీపతి.

తర్వాత నాలుగైదుసార్లు కలిసాడు. చాలాసార్లు ఆఫీసుకి ఫోన్ చేసాడు.

గౌరీపతికి చెప్తే?

రాజు లేచి లైటువేసాడు. టైం చూసాడు- పన్నెండు. గాయత్రి ఆదమరచి నిద్రపోతోంది.

బట్టలేసుకున్నాడు.

ఇంటికి బైట తాళంపెట్టి అక్కడికో అరకిలో మీటరు దూరంలో ఉన్న ఎస్.టి.డి బూత్‌కి వెళ్ళాడు. బూత్‌లో మనిషి జోగుతున్నాడు.

"లోకల్‌కాల్ చేసుకోవాలి"

అతను తలూపాడు.

రెండుసార్లు రింగ్ కాగానే గౌరీపతి ఫోన్ ఎత్తాడు.

"సారీరా- అర్ధరాత్రి..."

"భలేవాడివే. పోలీసాళ్ళకి ఇప్పుడే రోజు మొదలౌతుంది. చెప్పు" అన్నాడు.

రాజు వివరంగా జరిగినదంతా చెప్పాడు. చివర్న భైరవమూర్తి అన్న ఆ భయంకరమైన మాట కూడా చెప్పాడు.

"ఆ- అంత మాటన్నాడా... వాడు పోయాడు. నువ్వు అప్పు గురించి... అసలు, వడ్డీ అన్నీ మర్చిపో. వాడో గంటలో పోలీసు స్టేషన్లో ఉంటాడు..."

"వాడి డబ్బు నాకెందుకురా. త్వరలో కట్టేస్తాను"

"వాడంత మాటన్నాక నువ్వొక్క పైసా కట్టద్దు... కడితే నువ్వు స్టేషన్లో ఉంటావు. ఇంతకీ వాడి ఎడ్రస్ చెప్పు" అన్నాడు గౌరీపతి.

రాజు చెప్పాడు.

ఇంటికి తిరిగొచ్చి తాళం తీసి లోపలికెళ్ళాడు.

బెడ్‌రూంలోకెళ్ళి లైటు వేసాడు.

గాయత్రి అమాయకంగా నిద్రపోతోంది.

"పాపం- నాకోసం ఎంత ఆందోళన పడింది. ఎంత నిరుత్సాహపడింది" అనుకున్నాడు.

బట్టలు విప్పేసి లుంగీ కట్టుకున్నాడు.

బాత్రూంలోకెళ్ళి కాళ్ళు కడుక్కుని మంచం ఎక్కాడు.

గాయత్రిని దగ్గరకి లాక్కున్నాడు.

ఆమెకి మెలకువ వచ్చింది. అతన్ని అల్లుకుపోయింది.

**  **  **

అంతకుముందు తను ప్రేరేపించినా స్పందించకుండా పిల్లిలా ముడుచుకుపోయిన మొగుడు పులిలా ఎందువల్ల విజృంభిస్తున్నాడో ఆమెకి అర్థం కాలేదు.

అతన్ని తనలో కలిపేసుకునే ప్రయత్నం చేస్తోంది.

అంత చీకట్లోను గాయత్రి మొహం మతాబులా వెలుగుతున్నట్టు కనిపించింది రాజుకి.

## నెమలికన్ను

# పోకబంతిపువ్వు

దసరా పండుగ ముందురోజులు. రకరకాల పువ్వులు తెచ్చి బతుకమ్మలు పేర్చి ఎంతో ముచ్చటగా ఆడవాళ్ళు ఆడుకునే రోజులు. 'ఎంగిలిపువ్వు' బతుకమ్మ పండుగ ఇంకా రెండు రోజులుందనగా నన్ను మా అక్కలిద్దరూ ఊరికి పంపిస్తారు. ఎప్పుడు కొట్టాడినా ఇలాంటప్పుడు మాత్రం 'మస్కా' కొట్టి పంపిస్తారు పువ్వు తెస్తానని. ఇది ప్రతి ఏడూ జరిగే పద్ధతే. ముందు బెట్టు చేసినా నాకూ ఊరికెళ్ళాలంటే ఇష్టమే కనుక ఒప్పుకుంటాను. పువ్వు తెస్తే మోపెడు తెస్తాననీ, మన బతుకమ్మే అందరి బతుకమ్మలకన్నా పెద్దదిగా వుంటుందనీ అదీ నా కోరికేననీ వాళ్ళు ఊహించగలరు. అమ్మ పెద్ద స్థాంబాలం మెరిసేలా తోమి రేపటికి సిద్ధంగా వుంచేది. 'ఎంగిలిపువ్వు బతుకమ్మ', 'సద్దల బతుకమ్మ'ల రోజులే ముఖ్యం. కనుక సైకిల్ ఎక్కాను. ఏమంత దూరమనీ?! నలభై రెండు కిలో మీటర్లే!



ఊరి దగ్గర ఒక రోజున్నాను. ఈరోజు ఉదయమే పువ్వు తెంపుకొని మధ్యాహ్నం వరకు బయలుదేరితే సాయంత్రం చేరతాను. రేపు ఉదయం బతుకమ్మను తయారుచేస్తారు. పువ్వు తెంపడానికి వెళుతున్న నాకు తోడుగా ఉంటాడని మామామలు పర్వతాలు అనే జీతగాన్ని ఉంచారు. బయలుదేరాం.

ఆ సంవత్సరం వర్షాలు విపరీతంగా పడ్డాయి. బావులు, చెరువులన్నీ బతుకమ్మల్లా నిండుగా ఉన్నాయి.

బావులు దాటి, ఊరి చెరువు దాటి, డొంకవెంబడి ముందుకు నడుస్తున్నాం. దూరంగా కొండలు, గుట్టలు. భూమినిండా ఆముదం చేలు, జొన్నచేలు. అక్కడక్కడ నీటి కాల్వలు. నేల ఒక్కోచోట కయ్యలు కోసిన గుంతలు. పిల్లబాట రెండు వైపులా ఎన్నోరకాల పువ్వులు. కనిపించిన ప్రతి పువ్వూ తెంపాలనే ఆత్రత నాకు. కానీ, పర్వతాలు "అదెందుకు పటేలా?" అంటాడు. అదెందుకని నాకు తెలియకకాదు. కానీ, ఇదికూడా బతుకమ్మలో పేరిస్తే బాగుండుననే కోరిక. ఐనా గునుగుపువ్వు, ఉప్పుపప్పు, తంగెడుపువ్వు, పోకబంతి పువ్వు, సెలకాల అంచుల్లో ఎంతో ముచ్చటగా విరబూసిన ముద్దబంతి పువ్వులూ తెంపి గోనెబస్తా సగం పేర్చుకున్నాం. పువ్వేం బరువుండదు. నిండా నింపేద్దామని నేను. దాంట్లో ఇంకా కాల్చిన సీతాఫల కాయలు, కొన్ని గుడ్ల గుడ్ల కాయలూ, పండ్లూ వేయాలి. ఇన్ని కూరగాయలూ పట్టాలి. ఇవన్నీ పట్నం వరకు సైకిల్ మీద తీసికెళ్ళడం కష్టమని పర్వతాలు.

ఇంతలో శెలక మూలన గెట్టుమీద అడ్డంగా వేసిన ఎలుగులో బాగా కాసిన శిల్పలి చెట్టు. దాని కొమ్మకు కంకెడంత కాయ గుడ్ల గుడ్ల కాయ పండి విచ్చుకుంది. అబ్బ! ఎంత బాగుందో అని దాన్ని తెంపుకొను అటుగా రెండు అడుగులేసి ఎలుగు దాటబోయాను. బుస్సున పొడగాటి పాము పడగ విప్పి లేచింది. సుమారు రెండు మీటర్ల పొడవు దండ రెట్టంత మందంగా దోశెడు వెడల్పు పడగ విప్పి లేచింది. ఇక నా ప్రాణం పోయిందేనని చెంగున ఎగిరి వెనక్కి గెంతేసి ఒకటే పరుగు దీశాను. పడుతూ లేస్తూ....

పర్వతాలు పకపకా నవ్వుతున్నాడు. నా పక్కనే వుండి పామును చూశాడు. నాకన్నా చిన్నవాడు. వాడికేం భయం లేదు. నాకెంతో ఆశ్చర్యం. మరోవైపు గుండె దడ. ఇక నాకు ఏడుపొక్కటే మిగిలింది. పర్వతాలు నవ్వుతున్నాడు. ఐదు నిమిషాల తర్వాత వాడు ఆ పండూ, రెండు మంచి కాయలూ తెచ్చి చేతికిచ్చాడు. "ఎట్ల తెచ్చినవ్! పామును జంపినవా?" అడిగాను. "అది మననేం జేస్తది పటేలా! ఏయ్ పో అంటే పొయ్యింది. మనుసుల గుణంకన్నా దాని గునం మంచిది పటేలా" అన్నడు... అమ్మో!

-భూపాల్

# అపర్ణాసేన్ ప్రతిభ



నటిగా, దర్శకురాలిగా తన ప్రతిభను మరోసారి నిరూపించుకునే ప్రయత్నంలో బిజీగా ఉన్నారు అపర్ణాసేన్. 'పరోమిత్ ఏక్ దిన్' అనే చిత్ర నిర్మాణంలో ఆమె ఇప్పుడు నిమగ్నమయి ఉన్నారు. ఇద్దరు స్త్రీలకు సంబంధించిన ఇతివృత్తాన్ని ఆమె ఈ సినిమాకు ఎంచుకున్నారు. బెంగాలీ చిత్ర రంగంలోకి పద్దెనిమిదేళ్ళ కిందట ప్రవేశించిన అపర్ణ నటిగానే కాక దర్శకురాలిగా కూడా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆమె దర్శకత్వంలో రూపొందిన 36 చౌరంఘీ లేన్, పరోమా, సతి ప్రేక్షకుల బహుళ ఆదరణను పొందాయి. ఇప్పుడు తన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో ఆమె అత్త పాత్రను కూడా పోషిస్తున్నారు. నటిగా, దర్శకురాలిగా ఏకకాలంలో పనిచేయటం క్లిష్టమైనా అనివార్యమైందని ఆమె చెబుతున్నారు. జీవితానికి సంబంధించిన ఆమె ఆశలు, ఆరాటాలు విలక్షణమైనవి. సీత జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని అంతర్జాతీయ స్థాయి చిత్రాన్ని నిర్మించాలన్నది ఆమె స్వప్నం. ఆమె కలలు సాకారం చెందాలని ఆశిద్దాం మరి!